


పత్తి రైతుపై ఆంక్షల కత్తి

సీసీఐ ఆధ్వర్యాన పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసినా ఆంక్షల కారణంగా రైతులు ప్రైవేట్ వ్యాపారులనే ఆశ్రయిస్తున్నారు. 10లో



ప్యాకేజ్-13కి టెండర్లు

సీతారామ ప్రాజెక్టు ప్యాకేజ్-13లో భాగంగా పనులకు రూ.190 కోట్లు కేటాయించగా టెండర్ దరఖాస్తులు ఆహ్వానించారు. 10లో



వాతావరణం

జిల్లాలో శనివారం ఉష్ణోగ్రత ప్రభావం ఎక్కువగానే ఉంటుంది. ఉదయం నుంచే ఎండ మొదలై మధ్యాహ్నానికి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

రేపు జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన, ఆర్థిక శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10గంటలకు ఖమ్మం కలెక్టరేట్‌లోని ఎస్‌బీఐ బ్రాంచ్, స్త్రీశక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తారు. ఆతర్వాత బోనకల్, ముదిగొండ మండలాల్లోని పలు గ్రామాల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి భట్టి శంకుస్థాపన చేయనున్నారు.

28న 'నిధి ఆప్ కే నికట్'

ఖమ్మంసహకారనగర్: ఉద్యోగులు, పెన్షనర్లు, సంస్థల యాజమాన్యాలకు అవగాహన కల్పించడమే కాక సమస్యలు తెలుసుకునేందుకు ఈనెల 28న 'నిధి ఆప్‌కే నికట్' నిర్వహిస్తున్నట్లు ఎంప్లాయీ ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయ అధికారులు తెలిపారు. ఖమ్మంలో రైల్వే స్టేషన్ రోడ్డులోని జీవీ మాల్, భద్రాద్రి జిల్లా కేంద్రమైన కొత్తగూడెం మున్సిపాలిటీ కార్యాలయంలో ఈ కార్యక్రమం 28న ఉదయం 9-15నుంచి సాయంత్రం 4గంటల వరకు ఉంటుందని వెల్లడించారు. ఉద్యోగులు, యాజమాన్యాలకు ఆన్‌లైన్ సేవల విధివిధానాలపై అవగాహన కల్పించడమే కాక పెన్షనర్లకు జీవన ప్రమాణ్ సేవలు అందిస్తామని తెలిపారు.

ముగిసిన న్యాక్ బృందం పరిశీలన



సీల్డ్ కవర్ అందజేస్తున్న న్యాక్ బృందం

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో న్యాక్ బృందం పరిశీలన శుక్రవారం ముగిసింది. రెండు రోజుల కళాశాలలోని విభాగాలతో పాటు వసతులు, బోధన, ఫలితాలను టీఎస్‌కేసీ విభాగం చైర్మన్ డాక్టర్ పురుషోత్తం నాయక్, మెంబర్ కోఆర్డినేటర్ డాక్టర్ చంద్రికాలయం, సభ్యుడు జోసెఫ్ పరిశీలించారని ప్రిన్సిపాల్ డాక్టర్ జి.పద్మావతి తెలిపారు. అనంతరం వివరాలతో కూడిన నివేదికను సీల్డ్ కవర్‌లో అందించారన్నారు. అధ్యాపకులు జానకీరామారావు, రాకేష్, కృష్ణవేణి, రాజిరెడ్డి, ప్రవీణ్, రవిశంకర్, కుమారస్వామి, బొంద్యాలు, చేకూరి రమేష్, రమాదేవి, హదస్సరాణి, విద్యాప్రవీణ, మార్జియన, నర్సింహారావు, వెంకటేశ్వర్లు, శ్యామలాదేవి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

15వ బెటాలియన్‌లో ఓపెన్ హౌస్



ఆయుధాల పనితీరును వివరిస్తున్న పోలీసులు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం గంగారంలోని 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా శుక్రవారం ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు విధినిర్వహణలో వినియోగించే ఆయుధాల వివరాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం బెటాలియన్ కమాండెంట్ పీజేపీఎస్.చటర్జీ మాట్లాడుతూ పోలీసులు ఉపయోగించే ఆయుధాల ప్రత్యేకతలు, వివరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించామని తెలిపారు. అసిస్టెంట్ కమాండెంట్ ఎస్.డీ.రంగారెడ్డి, అధికారులతో పాటు గంగారం డీఏవీ, సత్తుపల్లి విశ్వశాంతి పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం భేష్!





మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ. పక్కన గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ వెంకటేశం, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సీపీ సునీల్‌దత్, ఎంపీ రఘురాంరెడ్డి, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య

- వరద విపత్తును ఎదుర్కొన్న తీరు అభినందనీయం
- సారనాథ్ మాదిరి బౌద్ధస్తూపం అభివృద్ధి చెందాలి..
- క్షేత్రస్థాయి పర్యటనలతోనే విద్యార్థులకు మెరుగైన విద్య
- రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- కలెక్టరేట్‌లో అధికారులు, వివిధ వర్గాల ప్రముఖులతో భేటీ

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరు బాగుందని.. ఈ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందేందుకు అనేక అవకాశాలు ఉన్నాయని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ తెలిపారు. నేలకొండపల్లిలోని బౌద్ధస్తూపం సారనాథ్ మాదిరి అభివృద్ధి చెందాలని, పర్యాటకులు తరలిరావాలని ఆకాంక్షించారు. ఉమ్మడి జిల్లా పర్యటనలో భాగంగా గవర్నర్ శుక్రవారం మధ్యాహ్నం ఖమ్మం కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఇక్కడ కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ఇతర అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి జిల్లా అధికారులు, వివిధ రంగాల ప్రముఖులతో గవర్నర్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రాముఖ్యత, సంస్కృతి, సంప్రదాయాలు, శాఖల వారీగా అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

క్షేత్రస్థాయి పర్యటనలతోనే విద్యార్థులకు విజ్ఞానం

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ఏర్పాటుచేసిన స్టడీటూర్లు బాగున్నాయని.. పాఠ్య పుస్తకాల కన్నా క్షేత్రస్థాయి పర్యటనలతోనే పిల్లలు మెరుగ్గా నేర్చుకుంటారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ విధానం అమలుచేయాలని సూచించారు. ప్రకృతి విపత్తులను ఎవరూ ఆపలేరని, కానీ ఆ సమయంలో నష్టం తగ్గించడం, పునరావాస చర్యలు చేపట్టడంలో జిల్లా యంత్రాంగం అవలంబించిన విధానం అభినందనీయమని కొనియాడారు. విద్యార్థులు, ప్రజలు కోల్పోయిన సర్టిఫికెట్లు త్వరగా జారీ చేసేలా ప్రత్యేకంగా క్యాంప్‌లు నిర్వహించిన కలెక్టర్‌ను అభినందించారు. జిల్లా అభివృద్ధిలో అధికారులు, ప్రజాప్రతినిధులే కాక ప్రముఖులు, రచయితలు, కళాకారులు భాగస్వాములు కావాలని సూచించారు. విద్య, వైద్య రంగాలలో జిల్లా మెరుగైన స్థానంలో ఉందని, మరో పర్యటనలో పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తానని గవర్నర్ తెలిపారు.

వ్యాధుల తీవ్రతను తగ్గించాం..

జిల్లాలో డెంగీ, అనీమియా కేసులు అధికంగా నమోదయ్యేవని, కొన్నేళ్లుగా తీసుకుంటున్న చర్యలతో గణనీయంగా తగ్గించామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. అనీమియా కేసులు మూడేళ్లలో ఆరు వంతుల వరకు తగ్గాయని చెప్పారు. జిల్లాలోని 50 ప్రభుత్వ పాఠశాలల్లో కిచెన్ గార్డెన్లు ఏర్పాటుచేయగా, మధ్యాహ్న భోజన నాణ్యత పరిశీలనకు జిల్లా అధికారులు ప్రతీ బుధవారం వెళ్తున్నారని తెలిపారు. అన్ని గ్రామాల్లో గ్రామాల్లో ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళా సంఘాలకు రుణాలు అందిస్తూ వ్యాపారాల నిర్వహణకు సహకరిస్తున్నామని చెప్పారు. మధిర నియోజకవర్గం ఎర్రుపాలెం మండలంలో 20 వేల మంది మహిళా సంఘాల సభ్యులతో ఇందిరా మహిళా డెయిరీ ఏర్పాటు చేశామని వివరించారు.

గవర్నర్‌తో ముఖాముఖి..

గవర్నర్‌తో ముఖాముఖిలో రచయితలు, కళాకారులు, అవార్డు గ్రహీతలు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు. అంతర్జాతీయ క్రీడాకారులు పవిత్రాచారి, పి.అఖిల్, స్టేజ్ ఆర్టిస్ట్ తాటికొండల నర్సింహారావు, కవులు ప్రసేన్, సాహిత్య, మువ్వా శ్రీనివాసరావు, ఇబ్రహీం నిర్గుణ్, సీనియర్ ఆర్టిస్ట్ ఎస్.రవి, వ్యాఖ్యాత, పుస్తక రచయిత కన్నెగంటి వెంకటయ్య, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పీసర ప్రభాకరరెడ్డి, సీనియర్ డ్యాన్స్ మాస్టర్ ఎస్.మాధవరావు తదితరులు గవర్నర్‌కు సంబంధిత రంగాల్లో ప్రత్యేకతలను వివరించారు. అలాగే, పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య, నంది అవార్డు గ్రహీత కవి దేవేంద్ర, సీనియర్ స్టేజ్ ఆర్టిస్ట్ పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్, రెడ్‌క్రాస్ అధ్యక్షుడు చంద్రమోహన్, కాళోజీ అవార్డు గ్రహీత డాక్టర్ సీతారాం సైతం ముఖాముఖికి హాజరయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీఎఫ్‌ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, అసిస్టెంట్ కలెక్టర్‌మ్రినాల్ శ్రేష్ఠ, జెడ్పీ సీఈఓ దీక్షారైనా, డీఆర్డీఓ సన్యాసయ్య, డీఓఓ సోమశేఖరశర్మతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

మరోసారి జిల్లాను సందర్శించాలి..

జిల్లా పర్యటనకు వచ్చిన గవర్నర్‌కు ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లో యువకులైన కలెక్టర్లు ఉండటం అదృష్టమని.. వారి నాయకత్వంలో జిల్లాలు అభివృద్ధి బాటలో నడుస్తున్నాయని చెప్పారు. జిల్లాలో పాలేరు రిజర్వాయర్, బౌద్ధ స్తూపం, కిన్నెరసాని, కేటీపీఎస్ సందర్శనకు మరోమారు పర్యటించాలని గవర్నర్‌ను ఎంపీ కోరారు.

ఫొటో ఎగ్జిబిషన్, స్టాళ్ల సందర్శన

ఖమ్మం సహకారనగర్: పర్యాటక, సమాచార శాఖల సంయుక్త ఆధ్వర్యాన జిల్లాలోని పర్యాటక ప్రదేశాలు, ఇతర ప్రత్యేకతల వివరాలతో ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సందర్శించారు. జిల్లాలోని జాఫర్ బావి, ఖమ్మం ఖిల్లా, లకారం సస్పెన్షన్ బ్రిడ్జి, వైరా, పాలేరు రిజర్వాయర్లు, నేలకొండపల్లిలోని బుద్ధ స్తూపం, జమలాపురం వేంకటేశ్వర స్వామి ఆలయం, కనకగిరి గుట్టల ఫొటోలను గవర్నర్ ఆసక్తిగా పరిశీలించారు. ఇక వ్యవసాయ శాఖ స్టాల్‌లో ఆయిల్ పామ్ పెంపకం, తదితర అంశాలతో ఫొటో ఎగ్జిబిషన్‌ను కూడా సందర్శించారు. గాంధీనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు రూపొందించిన చేతివృత్తులను, ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యాన చాగంటి లావణ్య రూపొందించిన మిల్లెట్ స్నాక్స్‌ను పరిశీలించారు.



పర్యాటక ప్రాంతాల ఫొటోలను పరిశీలిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సుడా.. మరింతగా!

- కొత్తగా రెండు మున్సిపాలిటీలు, 279 జీపీల విలీనం
- స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ పేరుతో 2017లో ఏర్పాటు
- నాడు కేఎంసీతో పాటు వైరా మున్సిపాలిటీ, 44 జీపీలు
- ప్రస్తుతం మూడు మండలాలు మినహా మిగతావి చేరుస్తూ నిర్ణయం



సుడా కార్యాలయం

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలోని పట్టణ ప్రాంతాలతో పాటు ఆనుకుని ఉన్న గ్రామాల అభివృద్ధికి గత ప్రభుత్వం స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్(సుడా)ను ఏర్పాటు చేసింది. 2017 అక్టోబర్ 24న ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్, వైరా మున్సిపాలిటీతో పాటు వీటి చుట్టుపక్కల ఉన్న నాలుగు మండలాల పరిధిలో 44 గ్రామపంచాయతీలను కలిపి 573 చదరపు కి.మీ. విస్తీర్ణంతో ఏర్పాటైంది. అప్పటి నుంచి పట్టణ, గ్రామపంచాయతీల్లో వెంచర్లు, లే ఔట్ అనుమతులు జారీ చేయడమే కాక ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. అయితే, ప్రస్తుత ప్రభుత్వం జిల్లాలోని మరో రెండు మున్సిపాలిటీలనే కాక వివిధ మండలాల్లోని జీపీలను సైతం చేరుస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఫలితంగా జిల్లాలోని మూడు మండలాలు మినహా జిల్లాలోని మిగతా ప్రాంతం 'సుడా' పరిధిలోకి వచ్చేసినట్లయింది.

విస్తరణతో మరింత అభివృద్ధి

'సుడా' విస్తరణ ద్వారా మరింత అభివృద్ధి సాధ్యమవుతుందనే భావనతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. హెచ్‌ఎండీఏ విస్తరణ ద్వారా హైదరాబాద్ చుట్టుప్రక్కల ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ఇక్కడ విస్తరించినట్లు సమాచారం. కామేపల్లి, ఏన్కూరు, కారేపల్లి మండలాలు మినహా అన్ని మండలాల పరిధిలోని గ్రామపంచాయతీలు సుడా పరిధిలోకి రావడంతో భవిష్యత్‌లో రూపురేఖలు మారుతాయని అంచనా వేస్తున్నారు. అంతేకాక గ్రామపంచాయతీల్లో అభివృద్ధి పనులకు అథారిటీ నిధులను వినియోగించే వీలు ఏర్పడుతుంది.

కొత్తగా రెండు మున్సిపాలిటీలు, 279 గ్రామాలు..

ఇప్పటికే ఖమ్మం కార్పొరేషన్ సహా కేఎంసీ, వైరా మున్సిపాలిటీతో పాటు 44 గ్రామపంచాయతీలు సుడా పరిధిలో ఉన్నాయి. ఇప్పుడు కామేపల్లి, ఏన్కూరు మండలాలు మినహా మిగిలిన 18 మండలాల్లోని 279 గ్రామపంచాయతీలు, మధిర, సత్తుపల్లి మున్సిపాలిటీలను సైతం విలీనం చేశారు. ఏజెన్సీ ప్రాంతాలు కావడమే కాక ఇతర కారణాలతో కామేపల్లి, ఏన్కూరు, కారేపల్లి మండలాలను మినహాయించినట్లు తెలుస్తోంది.

త్వరలోనే కొత్త పాలకవర్గం..

సుడా ఏర్పాటయ్యాక 2020 జూన్‌లో తొలి పాలకవర్గాన్ని గత ప్రభుత్వం నియమించింది. అయితే 2023 డిసెంబర్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక అదే నెలలో 10న పాలకవర్గాన్ని రద్దు చేసింది. చైర్మన్‌తో పాటు 14 మంది డైరెక్టర్లను పదవులు కోల్పోయారు. ప్రస్తుతం సుడాను విస్తరించిన నేపథ్యాన త్వరలోనే కొత్త పాలకవర్గాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది.

2017లో సుడా ఏర్పాటు సమయాన విలీనమైన జీపీలు

(ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్, వైరా మున్సిపాలిటీలు కలుపుకుని)

మండలం	గ్రామపంచాయతీలు
ఖమ్మం రూరల్	18
కూసుమంచి	02
ముదిగొండ	05
చింతకాని	06
కొణిజర్ల	07
రఘునాథపాలెం	06

ప్రస్తుతం 'సుడా'లో విలీనం కానున్న జీపీలు

(సత్తుపల్లి, మధిర మున్సిపాలిటీ కలుపుకుని)

మండలం	గ్రామపంచాయతీలు
రఘునాథపాలెం	04
ఖమ్మంరూరల్	04
తిరుమలాయపాలెం	25
కూసుమంచి	16
నేలకొండపల్లి	23
ముదిగొండ	19
చింతకాని	10
కొణిజర్ల	11
కల్లూరు	23
పేనుబల్లి	17
సత్తుపల్లి	12
వేంసూరు	14
తల్లాడ	19
వైరా	20
బోనకల్	18
మధిర	20
ఎర్రుపాలెం	24

ఖమ్మంలో ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ

- నాలుగు జిల్లాల పోలీసులకు అందుబాటులో..
- సులభం కానున్న కేసుల పరిశోధన

ఖమ్మంక్రైం: కేసుల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానం కీలకమవుతోంది. అయితే, ఆధారాల సేకరణ, శాస్త్రీయంగా నిర్ధారణ కోసం ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీని ఆశ్రయించాల్సిన నేపథ్యాన.. వివిధ జిల్లాలకు కలిపి వరంగల్‌లో మాత్రమే ల్యాబొరేటరీ ఉండడంతో పోలీసులకు సిబ్బందికి దూరభారమవుతోంది. ఈ నేపథ్యాన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలకు కలిపి ఖమ్మం జిల్లా కేంద్రంలోని ప్రాంతీయ ల్యాబొరేటరీ ఏర్పాటు చేశారు.

దూరభారం తగ్గేలా...

వరంగల్, ఖమ్మం, కరీంనగర్ పాత జిల్లాలకు కలిపి ప్రస్తుతం హనుమకొండలో ప్రాంతీయ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ కొనసాగుతోంది. ఈ జిల్లాల్లో నమోదైన కీలక కేసుల్లో సేకరించిన నమూనాలను నిర్ధారించి కోర్టుల్లో సమర్పించేందుకు సిబ్బంది తరచుగా వరంగల్ వెళ్లిరావాల్సి వస్తోంది. ఇక నల్లగొండ జిల్లాకు సంబంధించి కేసుల్లో హైదరాబాద్ వెళ్లాల్సి ఉంది. కొత్త జిల్లాలు ఏర్పాటయ్యాక కూడా ఇదే పరిస్థితి ఉండడంతో సిబ్బంది వ్యయప్రయాసాలు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఈ నేపథ్యాన ఖమ్మంలో కొత్తగా ప్రాంతీయ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీని ఏర్పాటుచేయగా దూరాభారం తగ్గనుంది. ఈసందర్భంగా సీపీ సునీల్‌దత్ మాట్లాడుతూ ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాలకు సంబంధించి ఖమ్మం జూబ్లీపురలోని ఎస్‌బీఐ ఎదుట పాత డీపీఆర్‌ఓ కార్యాలయంలో ఈ ల్యాబ్ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. దోపిడీ, దొంగతనాలకు సంబంధించి నిందితుల వేలిముద్రల నిర్ధారణ, అనుమానాస్పద మృతుల్లో దర్యాప్తు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు.

225మంది లష్కర్లు, హెల్పర్ల నియామకం

- గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన రాష్ట్రప్రభుత్వం
- కాంట్రాక్టు పద్ధతిలో తీసుకోవాలని నిర్ణయం

ఖమ్మంఅర్బన్: సాగునీటి సరఫరా, కాల్వల పర్యవేక్షణలో కీలకంగా వ్యవహరించే లష్కర్లు, హెల్పర్ల నియామకానికి ప్రభుత్వం అనుమతించింది. జిల్లాలో ప్రస్తుతం పనిచేస్తున్న వారు కాకుండా ఇంకా 176మంది లష్కర్లు, 49 మందిని హెల్పర్లను నియమించుకునేందుకు అవకాశం కల్పించినట్లు సమాచారం. జలవనరుల శాఖ సీఈ చైర్మన్‌గా, డీసీఈ, ఎస్‌ఈలు సభ్యులుగా ఉండే కమిటీ ద్వారా ఏజెన్సీ ని ఖరారు చేసి కాంట్రాక్టు పద్ధతిలో వీరిని నియమించాల్సి ఉంటుంది. అయితే, అర్హతలు, విధివిధానాలు, వేతనం తదితర అంశాలపై ఈఎన్‌సీ నుండి స్పష్టమైన ఆదేశాలు వచ్చాక నియామక ప్రక్రియ మొదలవుతుంది. నీటి సరఫరా పర్యవేక్షణ, కాల్వల మధ్యలో చిన్నచిన్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించడంలో లష్క ర్లు, హెల్పర్లు కీలకంగా ఉంటారు. అయితే, పూర్తిస్థాయిలో సిబ్బంది లేక ఇంజనీర్లపై భారం పడుతోంది. ప్రస్తుతం నియామకాలు చేపట్టనుండడంతో పనులు సాఫీగా సాగనుండగా ప్రస్తుతం ఇంజనీర్లపై ఉన్న ఒత్తిడి తగ్గుతుందని భావిస్తున్నారు.

ఓఎంఅండ్ పనులకు రూ.40 లక్షలు

జిల్లాలో నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చేపట్టాల్సిన పనుల కోసం ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్(ఓఎంఅండ్)లో భాగంగా సుమారు రూ.40 లక్షలు కేటాయించారు. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన ఓఎంఅండ్ కమిటీ సమావేశంలో ఈ కేటాయింపులు చేసినట్లు తెలిసింది. అయితే, ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

తీరిన దశాబ్దాల కల

- నైజాం కాలంలో మధిరలో కోర్టు
- ఇన్నాళ్ల తర్వాత సబ్ కోర్టు మంజూరు
- నేడు ప్రారంభించనున్న హైకోర్టు న్యాయమూర్తులు



సబ్ కోర్టు నిర్వహణకు పూర్తయిన ఏర్పాట్లు

మధిర: స్వాతంత్ర్యం రాకముందు 1930లోనే మధిరలో మున్సిఫ్ కోర్టు ఏర్పాటైంది. ఆతర్వాత సబ్‌కోర్టు, అదనపు కోర్టు ఏర్పాటుకు నోచుకోలేదు. నాలుగు దశాబ్దాల కాలంగా ఇక్కడి న్యాయవాదులు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధుల పోరాట ఫలితంగా ఎట్టకేలకు సబ్ కోర్ట్ మంజూరైంది. ఈ కోర్టు మంజూరులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలకంగా వ్యవహరించారు. ఇన్నాళ్లు సబ్‌కోర్టు లేక సత్తుపల్లి వెళ్లాల్సి వచ్చేది. ఎర్రుపాలెం మండలం వెంకటాపురం, రాజుపాలెం తదితర ప్రాంతాల వారు సత్తుపల్లి వెళ్లడానికి నాలుగు బస్సులు ఎక్కి దిగాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ క్రమాన సబ్ కోర్టు మంజూరు కావడంతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఇక 1930లో నిర్మించిన కోర్టు భవనం శిథిలావస్థకు చేరడంతో నూతన భవన నిర్మాణానికి రూ.24 కోట్లు, రికార్డు రూమ్ నిర్మాణానికి రూ.39 లక్షలు మంజూరు చేశారు. ఈ భవనాల నిర్మాణం పూర్తయ్యేవరకు తాత్కాలికంగా సబ్ కోర్టును రిక్రియేషన్ క్లబ్ కాంప్లెక్స్‌లో నిర్వహించనున్నారు.

నేడు హైకోర్టు న్యాయమూర్తుల రాక

ఖమ్మంలీగల్: మధిరకు మంజూరైన సబ్ కోర్టు శనివారం ప్రారంభం కానుంది. అంతేకాక నూతన కోర్టు భవన సముదాయం నిర్మాణానికి హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్ట్ పోలియో జడ్జి పి.శ్రీసుధ శంకుస్థాపన చేస్తారు. ఈ కార్యక్రమంలో మరో న్యాయమూర్తి భీమపాక నగేష్ సైతం పాల్గొంటారు. కాగా, పోర్ట్ పోలియో జడ్జి శ్రీ సుధ శనివారం ఖమ్మంలోని బార్ అసోసియేషన్ హాల్‌కు వస్తారని, అసోసియేషన్ సభ్యులంతా హాజరుకావాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



మధిరలో సబ్ కోర్టు ప్రారంభోత్సవం, కోర్టు భవన సముదాయ నిర్మాణానికి శంకుస్థాపన శనివారం జరగనుంది. ఇందుకోసం ఏర్పాట్లు పూర్తిచేశాం. భవన నిర్మాణం పూర్తయ్యే వరకు తాత్కాలికంగా రిక్రియేషన్ క్లబ్‌లో సబ్ కోర్టు నిర్వహణ ఉంటుంది.
– బోజడ్ల పుల్లారావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు

మధిర కోర్టు చరిత్ర

మధిర కోర్టు పరిధిలో తొలుత మధిర, ఎర్రుపాలెం, బోనకల్, తల్లాడ, వైరా మండలాలతో పాటు అశ్వారావుపేట, ఏన్కూరు, సత్తుపల్లి, వీ.ఎం.బంజర, దమ్మపేట, కల్లూరు తదితర మండలాలు ఉండేవి. ఆతర్వాత 1978లో సత్తుపల్లికి మున్సిపల్ మెజిస్ట్రేట్ కోర్టు మంజూరైంది. దీంతో ఇక్కడ తల్లాడ, వైరా, ఎర్రుపాలెం, బోనకల్, మధిర మండలాలే మిగిలాయి.

అదనపు జిల్లా కోర్టు కూడా..

సబ్‌కోర్టును మధిరలో ప్రారంభిస్తుండడంతో గతంతో పోలిస్తే ఇబ్బందులు కాస్త తగ్గుతాయి. కానీ క్రిమినల్ కేసుల విచారణ సత్తుపల్లిలోని అదనపు జిల్లాకోర్టులో జరుగుతోంది. దీంతో మధిరలో అదనపు జిల్లా కోర్టు కూడా ఏర్పాటుచేస్తే న్యాయవాదులు, కక్షిదారుల ఇక్కట్లు తొలగిపోతాయి.

క్లుప్తంగా

29న హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లాస్థాయి సబ్ జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు ఈనెల 29న నిర్వహిస్తున్నట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ పి.రఘునందన్ తెలిపారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న బాలికలు వయసు ధ్రువీకరణపత్రాలతో హాజరుకావాలని సూచించారు.

డంపింగ్‌యార్డ్‌లో హరితహారం



యార్డు స్థలంలో మొక్కలు నాటుతున్న సిబ్బంది

ఖమ్మంమయూరిసెంటర్: డంపింగ్ యార్డ్‌లో పేరుకుపోయిన వ్యర్థాలను బయో మైనింగ్ ద్వారా ఖాళీ చేయగా ఏడు ఎకరాల స్థలం అందుబాటులోకి వచ్చింది. ఈ స్థలంలో అటవీ శాఖ సమకూర్చిన మొక్కలను నాటుతున్నారు. మొత్తం 15 వేల మొక్కలను నాటాలనేది లక్ష్యం కాగా, శుక్రవారం వెయ్యి మొక్కలు నాటారు. కాగా, యార్డ్ పరిధిలో పది ఎకరాల స్థలంలో మొక్కలు నాటి పార్క్ ఏర్పాటు చేయనున్నట్లు కేఎంసీ అధికారులు వెల్లడించారు.

'టీడీపీ సభ్యత్వం ఉన్నా బీమా ఇవ్వడం లేదు..'

మధిర: టీడీపీ కోసం ఏళ్ల తరబడి కష్టపడిన తాను భర్త చనిపోయి ఇబ్బందుల్లో ఉంటే పార్టీ ద్వారా బీమా కల్పిస్తామన్న నేతలు ఇప్పుడు పట్టించుకోవడం లేదని మధిరకు చెందిన మన్నేపల్లి రత్నకుమారి వాపోయారు. ఆమె శుక్రవారం సోషల్ మీడియా ద్వారా వెల్లడించిన వివరాలు... రత్నకుమారి భర్త వీరవరప్రసాద్ పోలీసు శాఖలో పనిచేసి రిటైర్డ్ కాగా, ఈ ఏడాది ఫిబ్రవరి 23న జరిగిన ప్రమాదంలో మృతి చెందారు. అయితే, ముప్పై ఏళ్లుగా టీడీపీలో క్రియాశీలకంగా కొనసాగుతున్న రత్నకుమారి తన భర్త రిటైర్డ్ కాగానే అందరికీ పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. రూ.100 చెల్లించి సభ్యత్వం తీసుకుంటే రూ.2లక్షల బీమా బీమా వర్తిస్తుందని నాయకులు తెలిపారు. అయితే, వీరవరప్రసాద్ మృతి చెందిన విషయాన్ని తెలిపి బీమా వర్తించేలా చూడాలని కోరినా పట్టించుకోవడం లేదని రత్నకుమారి వాపోయారు. పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సొంత డబ్బు ఖర్చు చేసిన తనను కష్టకాలంలో పట్టించుకోకపోవడం సరికాదని తెలిపారు. ఇక ఇప్పుడు రూ.100 చెల్లించి సభ్యత్వ తీసుకుంటే రూ.5లక్షల బీమా అమలవుతుందని ప్రచారం చేయడాన్ని ఎలా నమ్మాలని ప్రశ్నించారు.

కులగణన చిత్తశుద్ధితో చేపట్టండి



మాట్లాడుతున్న శ్రీనివాస్

సత్తుపల్లిరూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం కులగణనను చిత్తశుద్ధితో చేపట్టాలని, తద్వారా కులాల వారీగా జనాభా లెక్కలు వెల్లడించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సత్తుపల్లిలోని సంఘం కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట మేరకు బీసీ జనాభా గణనతో పాటు కులాల వారీగా జనాభా వివరాలు సేకరించాలన్నారు. ఆపై జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు ఇతర అన్ని రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేస్తే బీసీలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల్లి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి టి.శ్రీనివాస్‌తో పాటు నాయకులు వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, అమీద్, రాయల కోటేశ్వరరావు, మారగాని రాంబాబు, డీఎస్.చారి తదితరులు పాల్గొన్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

ముదిగొండ: మండలంలోని కమలాపురంలో జూదం ఆడుతున్నారనే సమాచారంతో ఏఎస్ఐ సాంబశివశివరావు, సిబ్బంది శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా నలుగురు పట్టుబడగా రూ.3.130 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ మురళి తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,111	4,600
మిర్చి	17,000	6,500
మిర్చి తాలు	9,000	5,000
ఏసీ మిర్చి	18,900	9,000
ఏసీ తాలు	9,000	8,400
కొత్త పత్తి	7,000	6,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.17,043

పత్తి రైతుపై ఆంక్షల కత్తి

తేమ శాతం పేరిట సీసీఐ కొర్రీలు

- పది కేంద్రాలకు రెండు చోట్లే నామమాత్రపు కొనుగోళ్లు
- ఇప్పటి వరకు కొన్నది 33 టన్నుల పత్తి మాత్రమే..
- ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి నష్టపోతున్న రైతులు



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో అమ్మకానికి తీసుకొచ్చిన పత్తి బస్తాలు

ఖమ్మంవ్యవసాయం: పత్తి కొనుగోళ్లలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) విధించిన ఆంక్షలు రైతులకు గుదిబండగా మారాయి. 8–12 శాతం తేమ కలిగిన పత్తి మాత్రమే కొనుగోలు చేసేలా నిబంధనలను రూపొందించారు. అయితే, ఈ ఏడాది కురిసిన వర్షాలు పత్తి పంటను దెబ్బతీయగా.. తాజాగా కురుస్తున్న వర్షాలతో పంట నాణ్యత కోల్పోయింది. వర్షాధారంగా వేసిన పంట సాధారణంగా ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. కానీ అధిక వర్షాలు, తేమ కారణంగా 4నుంచి 5 క్వింటాళ్లు మించడం లేదు. అరకొరగా వచ్చిన పత్తిని గ్రామాలు, మార్కెట్లలో వ్యాపారులు క్వింటాకు రూ.4 వేల నుంచి రూ.6,500 మధ్య చెల్లిస్తున్నారు. ఈ నేపథ్యాన కనీస మద్దతు ధరతో పత్తి కొనుగోళ్లకు సీసీఐను రంగంలోకి దింపగా.. ఖమ్మం, మద్దులపల్లి, నేలకొండపల్లి, వైరా, మధిర వ్యవసాయ మార్కెట్ల పరిధిలో పది జిన్నింగ్ మిల్లులను కొనుగోళ్లకు ఎంపిక చేశారు.

తేమ పేరిట కొర్రీలు

పత్తి కొనుగోళ్లలో సీసీఐ కొర్రీలు పెడుతోందని రైతులు ఆరోపిస్తున్నారు. వర్షాల కారణంగా ప్రస్తుతం విక్రయానికి వస్తున్న పత్తిలో 20శాతం మేర తేమ ఉంటోందని సీసీఐ వెనకడుగు వేస్తోంది. జిల్లా యంత్రాంగం, ప్రభుత్వ శాఖలు మాత్రం సీసీఐ పత్తి కొనుగోళ్లకు సిద్ధంగా చెబుతుండగా క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేక రైతులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

కొనుగోళ్లు అంతంతే..

జిల్లాలో పది జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోలు చేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. వారం క్రితం రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతులమీదుగా ఖమ్మం మార్కెట్ పరిధిలోని గుర్రాలపాడు జిన్నింగ్ మిల్లులో కొనుగోళ్లు మొదలయ్యాయి. అలాగే, నేలకొండపల్లి మార్కెట్ పరిధిలో మరో మిల్లులో కొనుగోళ్లు మొదలుపెట్టగా మిగతా ఎనిమిది కేంద్రాల్లో ఇంకా శ్రీకారం చుట్టలేదు. ఇక రెండు మిల్లుల్లో కలిపి 33 టన్నుల పత్తిని మాత్రమే కొనుగోలు చేయడం గమనార్హం.

దిక్కుతోచక ప్రైవేట్‌లో విక్రయం

ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం తేమశాతం ఆధారంగా పత్తికి గరిష్టంగా రూ.7,521 ధర నిర్ణయించింది. అధిక వర్షాలతో దిగుబడి తగ్గిన నేపథ్యాన మద్దతు ధర తమకు కలిసొస్తుందని రైతులు ఆశించారు. కానీ తేమ పేరిట సీసీఐ కొర్రీలు పెడుతుండడం రైతులకు శాపంగా మారింది. మరోపక్క సీసీఐ కేంద్రాల్లో జాప్యాన్ని ఆసరా చేసుకుంటునవ్యాపారులు రూ.4 వేల నుంచి రూ.6,500 ధరతోనే పత్తిని కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు క్వింటాకు రూ.2వేల నుంచి రూ.3 వేల వరకు నష్టపోతున్నారు.

తేమ ఎక్కువగా ఉండడంతోనే..



8–12 శాతం మధ్య తేమ ఉంటే సీసీఐ పత్తి కొనుగోలు చేస్తుంది. అలా ఉండేలా రైతులు ఆరబెట్టుకుని తీసుకురావాలి. నిబంధనల మేరకు ఉన్యత ఉంటే కొనుగోళ్లు చేస్తుంది. సోమవారం నుంచి జిల్లాలో గుర్తించిన అన్ని మిల్లుల్లో పత్తి కొనుగోళ్లు మొదలవుతాయి.

– ఎం.ఏ.అలీం, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి

నిబంధనలతో ఇబ్బంది పడలేక..



తేమ ఎక్కువగా ఉందని, నాణ్యత లేదని సీసీఐ అధికారులు చెబుతున్నారు. ఇవన్నీ భరించలేక ధర తక్కువైనా అమ్ముకోవచ్చని ఖమ్మం మార్కెట్‌కు పత్తి తీసుకొచ్చా. ఇక్కడ తేమ పేరిట వ్యాపారులు క్వింటాకు రూ.5,500 చెల్లించారు. అయినా అమ్ముకోవాల్సి వచ్చింది.

– నంద్యాల సత్యం, తిమ్మినేనిపాలెం, చింతకాని మండలం

సీసీఐతో ప్రయోజనం లేదు..



సీసీఐతో రైతులకు ప్రయోజనం లేదు. మిర్చి పంటకు పెట్టుబడి అవసరం ఉంది. సీసీఐ తీరు నచ్చక ఖమ్మం మార్కెట్‌కు 41 బస్తాల పత్తి తీసుకొచ్చా. తేమ 10 శాతం కన్నా తక్కువే ఉన్నా క్వింటాకు రూ.7 వేలే చెల్లించారు. దీంతో క్వింటాకు రూ.500 నష్టం వచ్చింది.

– కర్ల రంగారెడ్డి, అమ్మపాలెం బంజర, దోర్నకల్ మండలం

మా వద్ద కేంద్రాలే లేవు..



ఏపీలో ఇంకాసీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. అవసరాల రీత్యా ఖమ్మం మార్కెట్‌కు 37 బస్తాల పత్తి తీసుకువచ్చా. 20 బస్తాలకు రూ.5,400 చొప్పున, మిగతా వాటికి రూ.4,700 ధర పెట్టారు. మిర్చి పంటకు పెట్టుబడి అవసరం ఉంది. అందుకే అమ్మక తప్పలేదు.

– బొల్లేపల్లి లీలాకృష్ణ, కమ్మవారిపాలెం, కృష్ణాజిల్లా, ఏపీ

ఎకో బ్రిక్ టీపాయ్‌కు గవర్నర్ ప్రశంస



ఎకోబ్రిక్ టీపాయ్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర గవర్నర్



సారపాక గ్రామపంచాయతీ ఆధ్వర్యాన రూపొందించిన ఎకోబ్రిక్ టీపాయ్

బూర్గంపాడు: భద్రాద్రి కలెక్టరేట్‌కు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వచ్చిన సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రత్యేక స్టాళ్లలో సారపాక గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో తయారు చేసిన ఎకోబ్రిక్ టీపాయ్ ఆయనను ఆకర్షించింది. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాళ్లను పరిశీలించిన గవర్నర్ సారపాక గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎకోబ్రిక్ టీపాయ్‌ను ప్రత్యేకంగా ప్రశంసించారు. దీనిని తయారు చేసిన విధానాన్ని జిల్లా కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ ఆయనకు వివరించారు. తాగి పడేసిన వాటర్ బాటిళ్లు, కూల్‌డ్రింక్ బాటిళ్లతో ఎకో బ్రిక్ టీపాయ్ తయారు చేసినట్లు వివరించారు. సారపాక గ్రామపంచాయతీలో చేపడుతున్న ఎకోబ్రిక్ చర్యలను అభినందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విద్యాచందన, వేణుగోపాల్, మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరెడ్డి, ఎస్‌బీఎం జిల్లా కోఆర్డినేటర్ రేవతి, ఖాదర్, ఎంపీడీఓ జమలారెడ్డి, ఎంపీఓ సునీల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు ఏర్పాటు

బోనకల్: మండలంలోని చొప్పకట్లపాలెంలో అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్‌ను శుక్రవారం ఏర్పాటుచేశారు. బోనకల్, చొప్పకట్లపాలెం గ్రామాలు ఏపీకి సరిహద్దుగా ఉండడంతో ఇతర రాష్ట్రాల నుండి ధాన్యం తీసుకురాకుండా కట్టడి చేసేందుకు చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసినట్లు సివిల్ సప్లయీస్ డీటీ రాంచందర్‌రెడ్డి, తహసీల్దార్ పున్నం చందర్ తెలిపారు. ఎంపీడీఓ రమాదేవి, ఆర్ఐ లక్ష్మణ్, ఎంపీఓ శాస్త్రి, ఏఈఓ త్రివేణి, ఎస్ఐ మధుబాబు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన గోపాల్‌రెడ్డి



సీఎంకు కృతజ్ఞతలు చెబుతున్న గోపాల్‌రెడ్డి

కామేపల్లి: తెలంగాణ వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ సభ్యుడిగా ఇటీవల నియమితులైన రాంరెడ్డి గోపాల్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులను కలిశారు. కమిషన్ సభ్యుడిగా తనపై నమ్మకంతో నియమించడంపై కృతజ్ఞతలు తెలిపారు. అంతేకాక రైతుల పక్షాన వారికి ఉత్తమ సేవలు అందిస్తామని ఆయన పేర్కొన్నారు.

సామాజిక తనిఖీలో బయటపడిన అక్రమాలు

కామేపల్లి: అటవీశాఖ ఆధ్వర్యాన నర్సరీలో చేపట్టిన మొక్కల పెంపకంలో అక్రమాలు జరిగినట్లు సామాజిక తనిఖీలో బయటపడింది. మండలంలోని ఊట్కూర్ జీపీ కార్యాలయంలో శుక్రవారం ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ శాఖ నర్సరీలో 749 బెడ్లు ఏర్పాటుచేసి 310 బెడ్లలో కలుపు తీయడమే కాక 382 బెడ్లు తరలించినట్లు రికార్డులో నమోదు చేశారు. ఈ పనులన్నీ వారం వ్యవధిలో పూర్తిచేసినట్లు పేర్కొనగా.. రూ.2,13,179 చెల్లించినట్లు తెలిపారు. కాగా, బృందంలో తనిఖీల్లో కేవలం 134 బెడ్లు మాత్రమే ఉన్నట్లు తేలింది. ఇక గ్రామంలో 390 మొక్కలు నాటగా 46 మొక్కలు మాత్రమే ఉన్నాయని గుర్తించారు. ఈ సమావేశంలో ఎస్ఆర్‌పీ సాంబశివచారి, డీఆర్పీలు శ్రీను, రవి, కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీతారామ ప్యాకేజీ-13కి టెండర్లు

ఖమ్మంఅర్బన్: సీతారామ ఎత్తిపోతల పథకంలోని ప్యాకేజీ–13లో భాగమైన పాలేరు లింక్ కెనాల్ నిర్మాణానికి జలవనరుల శాఖ అధికారులు టెండర్లు పిలిచారు. 10.5 కి.మీ. పొడవైన ఈ కెనాల్ పనుల అంచనా వ్యయం రూ.190 కోట్లుగా పేర్కొన్నారు. టెండర్ దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకునేందుకు శుక్రవారం నుంచే అవకాశం కల్పించినట్లు జలవనరుల శాఖ ఖమ్మం ఎస్ఈ ఓ ప్రకటనలో తెలిపారు. కాగా, టెండర్ల నమోదుకు నవంబర్ 8వ వరకు గడువు ఉందని వెల్లడించారు. సింగరేణి మండలం చీమలపాడు నుండి ఏన్కూరు మండలం బురదరాఘువాపురం వరకు ఈ ప్యాకేజీలో భాగంగా మట్టి తవ్వకం, కట్ట నిర్మాణం, సీసీ లైనింగ్ తదితర పనులు చేపట్టాల్సి ఉంటుంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



పాండురంగాచారి (ఫైల్)

వేంసూరు: మండలంలోని కల్లూరుగూడెం ప్రధాన రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. అడసర్లపాడుకు చెందిన తాటికొండ పాండురంగాచారి(42) మర్లపాడులోని తన షాపునకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కల్లూరుగూడెం వద్ద రహదారిపై గేదెలు అడ్డుగా వచ్చాయి. వీటిని తప్పించే క్రమాన కంకర్‌లోడ్ టిప్పర్ లారీ ఢీకొట్టడంతో ఆయనకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వీర ప్రసాద్ పేర్కొన్నాడు.

చికిత్స పొందుతున్న వ్యక్తి...

పెనుబల్లి: పొరపాటుగా యాసిడ్ తాగిన మండలంలోని కేదబ్బ్యా చౌడవరానికి చెందిన కణితి సత్యనారాయణ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన మద్యం మత్తులో బ్యాటరీలో పోసే యాసిడ్‌ను తాగునీటిగా భావించి తాగగా.. ఆ విషయాన్ని కుమారుడు సాయికిరణ్‌కు చెప్పాడు. దీంతో సత్యనారాయణను కల్లూరులోని ఆస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మం తరలించి చికిత్స చేయిస్తుండగా శుక్రవారం మృతి చెందాడు. ఘటనపై సాయికిరణ్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.వెంకటేష్ తెలిపారు.

ఏపీజీవీబీలో చోరీకి యత్నం

కల్లూరు: కల్లూరు మెయిన్‌రోడ్‌లోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్‌బ్యాంక్‌లో చోరీకి దుండగులు విఫలయత్నం చేశారు. గురువారం అర్ధరాత్రి దాటాక బ్యాంక్ గ్రిల్స్‌కు వేసిన నాలుగు తాళాల్లో ఒకటి పగులగొట్టారు. అయితే, మిగిలిన తాళాలు పగలకపోవడంతో తమ ప్రయత్నాన్ని విరమించుకుని వెళ్లిపోయారు. ఈ ఘటనలో ఒక పురుషుడు, ఓ యువతి పాల్గొన్నట్లు సీసీ ఫుటేజ్ ద్వారా గుర్తించిగా బ్రాంచ్ మేనేజర్ రవికుమార్ శుక్రవారం ఉదయం చేసిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిపై కేసు

ఖమ్మం క్రైం: అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఖమ్మం త్రీటౌన్ సీఐ రమేష్ తెలిపారు. తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం (టీపీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడిగా చెప్పుకుంటున్న కె.రామారావు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలను డబ్బు డిమాండ్ చేయడమే కాక, ఇవ్వకపోతే పాఠశాలలపై తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు పలువురు ఫిర్యాదు చేశారు. ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ అధ్యక్షుడు జి.కాంతారావు, బాధ్యులు అశోక్, కౌశిక్, మతిన్, అప్పారావు తదితరులు ఇచ్చిన ఫిర్యాదుతో రామారావుపై కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్ తెలిపారు.

యార్డు కాదు.. మున్నేరు ఒడ్డు



ఖమ్మంరూరల్ మండలంలోని మున్నేరు పరీవాహక ప్రాంతంలో కుప్పలుగా చెత్త వేస్తున్నారు. జలగంనగర్, పెద్దతండాతోపాటు పలు గ్రామాల్లో సేకరించే చెత్తను వాహనాల్లో తీసుకొచ్చి ఇక్కడ డంప్ చేస్తున్నారు. దీంతో నానాటికీ చెత్త పేరుకుపోతుండగా.. నీటిలో కలిసి దుర్వాసన వెదజల్లుతోంది. అలాగే మంట పెనడుతుండడంతో విష వాయువులు గాలిలో వ్యాప్తించి ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్

'బీఆర్ఎస్ నేతలపై తప్పుడు కేసులు..'



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాత మధు, పక్కన సండ్ర, తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: ఎవరి కళ్లల్లో ఆనందం చూసేందుకు తమ పార్టీ నేతలపై పోలీసులు కేసులు పెట్టి అరెస్టు చేస్తున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్ ప్రశ్నించారు. ఖమ్మంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్‌తో కలిసి మాట్లాడారు. ప్రజాసమస్యలను పక్కదారి పట్టించేలా కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలు ఉన్నాయన్నారు. బీఆర్ఎస్ ఖమ్మం, ఖమ్మంరూరల్, తిరుమలాయపాలెం మండలాల అధ్యక్షులను కొన్నాళ్ల క్రితం, ఇప్పుడు అయ్యప్ప దీక్షలో ఉన్న చింతకాని మండల అధ్యక్షుడిని అక్రమంగా అరెస్ట్ చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల కళ్లల్లో ఆనందం చూసేందుకే అధికారులు ఇలా వ్యవహరిస్తున్నప్పటికీ, ఎల్లాకాలం కాంగ్రెస్ ప్రభుత్వం ఉండదని తెలిపారు. ఆత్మహత్య చేసుకున్న రైతు బోజెడ్ల ప్రభాకర్, విద్యుత్ షాక్‌తో మరణించిన రైతు గూని ప్రసాద్‌కు న్యాయం చేయకుండా వారి కుటుంబీకులు, బీఆర్ఎస్ నాయకులపై తప్పుడు కేసులు పెట్టడం గర్హనీయమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, రైతు గూని ప్రసాద్ కుమార్తె సునీత, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

బెదిరింపులతో లొంగతీసుకోలేరు

చింతకాని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పి.పుల్లయ్యపై తప్పుడు కేసు పెట్టి అరెస్టు చేయించడం ద్వారా అధికార పార్టీ నాయకులు బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నారని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. అయితే, ఇలాంటి చర్యలతో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు లొంగతీసుకోలేరని వారు తెలిపారు.

వరిలో ఎండాకు బ్యాక్టీరియా తెగులు



తెగులు సోకిన పొలంలో పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

కూసుమంచి: పలు ప్రాంతాల్లో వరి పైరుకు ఎండాకు బ్యాక్టీరియా తెగులు సోకిందని శాస్త్రవేత్తలు, అధికారులు తెలిపారు. మండలంలోని కొత్తూరు, ఎర్రగడ్డతండా గ్రామాల్లో తెగుళ్లు సోకిన వరి పొలాలను వైరా కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్, కూసుమంచి ఏడీఏ సరిత శుక్రవారం పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. బ్యాక్టీరియా ఎండాకు తెగుళ్లు ఆశించిన పొలాలకు నత్రజని ఎరువు వాడకాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలని తెలిపారు. తెగులు సోగాక నివారించడం కష్టమని, అందుకే ముందుగా లక్షణాలను గుర్తిస్తే వ్యాప్తిని అరికట్టవచ్చని చెప్పారు. ప్లాంటామైసిన్, పోషమైసిన్, అగ్రిమైసన్ మందుల్లో ఏదో ఒకటి పిచికారీ చేయాలని, వర్షాలు తగ్గాక ఆఖరు దఫా పొటాష్‌ను ఎకరాకు 20 కిలోల మేర వేయాలని సూచించారు. అలాగే, వరిలో కంకినల్లి, మానిపండు నివారణకు స్పైరోమిసిఫెన్, ప్రోపికొనజోల్ ద్రావణాన్ని పిచికారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ వాణి, ఏఈఓ మానస, రైతులు పాల్గొన్నారు.

ఈ–నామ్‌లో సాంకేతిక సమస్య

పాత విధానంలోనే పంటల కొనుగోళ్లు

ఖమ్మంవ్యవసాయం: ఈ–నామ్(ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్) విధానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. సర్వర్లు పనిచేయక గత సోమవారం నుంచి ఖమ్మం మార్కెట్‌లో ఈ–నామ్ అమలు కావడం లేదు. ఇక్కడి మార్కెట్‌లో పత్తి, అపరాల కొనుగోళ్లలో కొన్నేళ్లుగా ఈ–నామ్ విధానం అమలుచేస్తున్నారు. రైతు మార్కెట్‌కు పంట తీసుకొచ్చాక వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి గుర్తింపు నంబర్ కేటాయిస్తారు. ఈ నంబర్ ఆధారంగా కమీషన్‌దారులు ఖరీదుదారులకు పంటను చూపించి, ఆతర్వాత ధరను రహస్యంగా బిడ్ చేస్తారు. తద్వారా పోటీ ఏర్పడి రైతుల పంటకు మెరుగైన ధర లభిస్తోంది. అంతేకాక పంట తూకం కూడా ఈ–నామ్‌కు అనుసంధానమై ఎలాంటి తేడా లేకుండా దడువాయి పట్టీ జారీ అవుతోంది. అయితే, ప్రస్తుతం సర్వర్ పనిచేయకపోవడంతో పాత పద్ధతిలోనే కొనుగోలు చేస్తున్నారు. రైతులు తీసుకొచ్చిన పంటల ధర, తూకం వివరాలను చేతిరాతతో నమోదు చేస్తుండడంతో కొంత మేర నష్టం జరుగుతోందని చెబుతున్నారు. ఈ అంశంపై మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్‌ను వివరణ కోరగా దేశవ్యాప్తంగా సర్వర్ పనిచేయడం లేదని, ఒకటి, రెండు రోజుల్లో పరిష్కారమయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం అందిందని తెలిపారు.

తెలంగాణను అప్పుల పాలు చేశారు..

- మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్
- విద్యుత్ కేంద్రం సాధనకు కాళ్లయినా పట్టుకుంటా: కూనంనేని



ప్రార్థనలో పాల్గొన్న ఎంపీ, తదితరులు

పాల్వంచ: ప్రజల త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న తెలంగాణను కేసీఆర్ తన పదేళ్ల పాలనలో అప్పుల పాలు చేశారని మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్ ఆరోపించారు. పాల్వంచ కేటీపీఎస్ 5, 6వ దశల కర్మాగారం ఎస్ఈ కాటం సంజీవయ్య ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భంగా శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేయగా.. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంతో కలిసి పాల్గొన్న ఎంపీ మాట్లాడారు. ప్రజల ఆకాంక్షను గుర్తించి సోనియా గాంధీ రాష్ట్రాన్ని ఇస్తే.. మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణను కేసీఆర్ అప్పుల ఊబిలోకి నెట్టారని విమర్శించారు. కాగా, సింగరేణి, జెన్‌కో ఉద్యోగుల సంక్షేమంపై కృషి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ.. పాల్వంచకు మరో 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన విద్యుత్ కేంద్రాన్ని తెచ్చేందుకు తలవంచుతానని, అవసరమైతే కాళ్లయినా పట్టుకుంటానని చెప్పారు. ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడగా రాష్ట్ర అటవీ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య, సీఈలు పి.వెంకటేశ్వరరావు, ఎం.ప్రభాకర్‌రావు, శ్రీనివాసబాబు, బిచ్చన్న, టీఎస్ఎస్.మూర్తి, రిటైర్డ్ సీఈ సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో ప్రార్థనలు

ఇల్లందు: ఇల్లెందుకు చెందిన కూరగాయల వ్యాపారి యాకూబ్ కుమారులు గౌస్, జానీ, ఖాజా ఆధ్వర్యాన శుక్రవారం దర్గాలు ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ ప్రార్థనకు మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే మురళీనాయక్ తదితరులు హాజరయ్యారు.